సాక్షి నల్లగొండ

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



రేషన్ బియ్యం ముఠా అరెస్ట్

రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ముఠాను గురువారం వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 590.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 78,997 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 32,400 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,557 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,067 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,173 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 644.30 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 1,390 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 771 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 146 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 243 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి

మిర్యాలగూడ టౌన్: టీజీఎస్ ఆర్టీసీ ద్వారా అందిస్తున్న లాజిస్టిక్స్ (కార్గో) సేవలను సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల కార్గో ఏటీఎం సీ. రవీందర్ కోరారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24గంటల పాటు రాష్ట్ర వ్యాప్తంగా డెలివరీ సదుపాయం ఉందన్నారు. తక్కువ ధరలతో మరిన్ని సేవలు అందిస్తున్న ఏకైక లాజిస్టిక్స్ ఆర్టీసీ సంస్థ అని పేర్కొన్నారు. మరింత అవగాహన కల్పించేందుకు డిపోల పరిధిలో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ లాజిస్టిక్ సెల్స్ టీం లీడర్ శ్యాంకుమార్, మిర్యాలగూడ టీం సభ్యులు పరంగి నాగేశ్వర్‌రావు, హరిలాల్, జానీ పాషా, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు



పుట్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ఆఫ్ సైకాలజిస్టు సభ్యులు

నల్లగొండ టౌన్: వైద్యాధికారులు, సిబ్బంది ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం నల్లగొండలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మెడికల్ అధికారులు, బస్తీ దవాఖానా మెడికల్ అధికారులకు అసోసియేషన్ ఆఫ్ సైకాలజిస్టు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సమీక్ష న్యూరో సైకియాట్రిస్టు పన్నాల శిల్ప, డాక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, వైశాలిరెడ్డి, రవి, గీతావాణి, పాల్గొన్నారు.

నేటి నుంచి తెరుచుకోనున్న డిగ్రీ, పీజీ కళాశాలలు



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల అసోసియేషన్ నాయకులు

నల్లగొండ రూరల్: పెండింగ్‌లో ఉన్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని చేపట్టిన నిరవధిక బంద్‌ను విరమించుకుంటున్నట్లు టీపీడీపీఎంఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్ రెడ్డి గురువారం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో పాటు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఇచ్చిన హామీ మేరకు బంద్‌ను విరమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కళాశాలలను శుక్రవారం నుంచి తెరవనున్నట్లు తెలిపారు. అంతకు ముందు గాంధీ విగ్రహానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వాహకులు రాంమోహన్, నర్సింహారెడ్డి, గుండెబోయిన జానయ్య పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి



టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి

త్రిపురారం: రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం త్రిపురారంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీకాల పంపిణీ నవంబర్ 14వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. త్రిపురారం, అంజనపల్లి గ్రామాల్లో 14 ఆవులు, 356 గేదెలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు త్రిపురారం పశువైద్యాధికారి డాక్టర్ నాగేందర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శశికళ, రాహుల్, కృష్ణ పాల్గొన్నారు.



సీఎం కప్ టార్చ్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న క్రీడాకారులు

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం క్రీడా కప్‌లో భాగంగా గురువారం నల్లగొండలో నిర్వహించిన టార్చ్ ర్యాలీకి క్లాక్ టవర్ వద్ద మంత్రి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివిధ క్రీడల్లో పతకాలు పొందిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలతో పాటు, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం క్రీడా కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ హైదరాబాద్ రోడ్డులోని ఎల్‌వీ పెట్రోల్ బంక్ నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు సాగింది. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ క్రీడల అభివృద్ధి అధికారి విష్ణుగౌడ్, హఫీజ్ ఖాన్, ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ బొమ్మ పాల గిరిబాబు, హాకీ అసోసియేషన్ సెక్రెటరీ ఇమామ్ కరీం, శంభు లింగం, సీహెచ్ పుల్లయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలపై సందిగ్ధత!

క్వింటా సన్న ధాన్యానికి 67 కిలోల సీఎంఆర్ ఇవ్వలేమంటున్న మిల్లర్లు

- 58 కిలోల బియ్యమే ఇస్తామంటూ మెలిక
- మూడుసార్లు సమావేశమైనా ఎటూ తేల్చని ప్రభుత్వం
- జిల్లాలో ప్రారంభం కాని సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- మిల్లుల్లో తక్కువ ధరకే అమ్ముకోవడం తోపాటు, బోనస్ నష్టపోతున్న రైతులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సన్న ధాన్యం కొనుగోళ్లపై ఇంకా సందిగ్ధత వీడలేదు. క్వింటా సన్న ధాన్యానికి 67 కిలోల బియ్యాన్ని ఇవ్వలేమంటూ మిల్లర్లు మెలిక పెట్టారు. ఈ విషయంలో మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించి మూడుసార్లు చర్చలు జరిపినా ఎటూ తేల్చలేదు. దీంతో ప్రభుత్వం సన్న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదు. ఫలితంగా రైతులు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా చేసుకుని మిల్లర్లు తక్కువ ధరకు కొంటుండటంతో రైతులు ధర పరంగా నష్టపోవడంతో పాటు ప్రభుత్వం ఇచ్చే రూ. 500 బోనస్ కూడా కోల్పోతున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో దొడ్డు ధాన్యంతో పాటు సన్నధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించింది. సన్న ధాన్యం కొనుగోలు చేసి ఆ బియ్యాన్ని రేషన్ కార్డు దారులకు పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన బియ్యం ఇవ్వాలని భావించి సన్నాలు కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే సన్న ధాన్యం తీసుకొని సీఎంఆర్‌గా ఇవ్వాలని మిల్లర్లను ఆదేశించింది.

మరోసారి చర్చలు జరిపినా..

ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్, ఇతర ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి ఏటా ధాన్యం కొనుగోలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వమే రైతులకు డబ్బు చెల్లిస్తుంది. ఆ ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చి క్వింటా ధాన్యానికి 67 కిలోల లెక్కన బియ్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద తీసుకుంటూ వస్తోంది. అయితే ఈసారి సన్న ధాన్యం కూడా ప్రభుత్వం కొనేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో మిల్లర్లు దొడ్డు ధాన్యం మాదిరిగా సన్న ధాన్యం క్వింటాకు 67 కిలోల బియ్యం ఇవ్వడం సాధ్యం కాదని, తాము నష్టపోవాల్సి వస్తుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కేవలం 58 కిలోల బియ్యమే ఇస్తామని, ఆ మేరకు ప్రభుత్వం అంగీకరించకపోతే తాము సన్నాలు తీసుకోలేమని మిల్లర్లు మెలిక పెట్టారు. దీంతో ప్రభుత్వం మంత్రుల నేతృత్వం సబ్ కమిటీని నియమించింది. ఇప్పటికే రెండు దఫాలుగా చర్చలు జరిపారు. బుధ, గురు వారాల్లోనూ మరోసారి చర్చలు జరిపినా సన్న ధాన్యం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

నష్టపోతున్న రైతులు

జిల్లాలో ఈ సీజన్‌లో దొడ్డు ధాన్యం కొనుగోలుకు 295 కేంద్రాలు, సన్న ధాన్యం కొనుగోలుకు 80 కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం ఇప్పటికే నిర్ణయించింది. దొడ్డు ధాన్యం కొనుగోలుకు ఇప్పటివరకు 200 వరకు కేంద్రాలు ప్రారంభించినా ఇంకా కొనుగోళ్లలో వేగం పుంజుకోలేదు. ఇక సన్న ధాన్యం కొనుగోలుకు ఒక్క కేంద్రం కూడా ప్రారంభించలేదు. సన్న ధాన్యం సీఎంఆర్ విషయంలో మిల్లర్లు మెలిక పెట్టడం, దానిపై ప్రభుత్వం ఓ నిర్ణయాన్ని తీసుకోకపోవడంతో సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొనుగోళ్లు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం సన్నధాన్యం కోతలు పూర్తి చేసుకున్న రైతులు గత్యంతరం లేని పరిస్థితిలో మిల్లుల వద్ద తక్కువ ధరకే అమ్ముతున్నారు. దీంతో వారికి కనీస మద్దతు ధర రూ. 2320 కూడా లభించడం లేదు. అంతేకాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే క్వింటాకు రూ. 500 బోనస్ కూడా నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం సన్న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించే వరకు ఆగి, ధాన్యం ఆరబెట్టుకుంటామనుకున్నా వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందనే భావనతో మిల్లుల్లోనే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ: ప్రాజెక్టుల కింద భూసేకరణను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రాజెక్టుల కింద భూసేకరణకు గుర్తించిన భూమి, ముందుగా అత్యవసరంగా అవసరమయ్యే భూమి జాబితా రూపొందించాలన్నారు. రెవెన్యూ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ భూములు, పట్టా భూములు, ఫారెస్ట్ భూముల విషయంలో ఆర్డీఓ, తహసీల్దార్, డీఎస్‌ఓలు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకొని ఇబ్బందులు వస్తే పరిష్కరించాలన్నారు. భూసేకరణకు సంబంధించి సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని తెలిపారు. పట్టా భూములు, జనరల్ అవార్డులకు సంబంధించి రైతుల సమ్మతితో అవార్డులు పాస్ చేయాలని సూచించారు. ప్రతివారం క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించనున్నామని కలెక్టర్ చెప్పారు. నెల్లికల్, నక్కలగండి తదితర ఎత్తిపోతల పథకాల కింద ఫారెస్ట్ భూములకు సంబంధించి ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తామని డీఎఫ్ఓ రాజశేఖర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఎఫ్ఓ రాజశేఖర్, ఆర్డీఓలు శ్రీరాములు, సుబ్రమణ్యం, శ్రీదేవి, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు పోరాటం చేస్తాం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

నల్లగొండ టౌన్: మహిళా హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. గురువారం నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ఐద్వా మహాసభలో ఆమె జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మనువాద ప్రభుత్వం వచ్చినప్పటికీ మహిళలపై అనేక దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలు అదుపు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఉపాధి పనులు కల్పించడంలో ప్రమాణాలను పాటించడం లేదన్నారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీల్లో ఖమ్మంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు నివాళులర్పించారు. అదేవిధంగా ఐద్వా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పోలేబోయిన వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా పాలడుగు ప్రభావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జిట్ట సరోజ, కొండ అనురాధ, నాగమణి, తుమ్మల పద్మ, భూతంఅరుణ కుమారి, నిమ్మల పద్మ, కారంపుడి ధనలక్ష్మి, పాదూరి గోవర్ధన, మేకల వర్ష, లక్ష్మి, ఎం.డి. సుల్తానాతోపాటు 33 మంది కమిటీని ఎన్నుకున్నారు.

- గంధం ఊరేగింపు



నల్లగొండలోని లతీఫ్ ఉల్లాషాఖాద్రి ఉర్సులో భాగంగా నిర్వహించిన గంధం ఊరేగింపులో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- రామగిరి(నల్లగొండ)

విత్తనోత్పత్తి క్షేత్రం ఏర్పాటుకు సన్నాహాలు

- డిండి మండలంలోని చెరుకుపల్లిలో ఏర్పాటు
- యాసంగి నుంచే విత్తనోత్పత్తి ప్రారంభం
- తొలుత వరి, వేరుశనగ విత్తనాల ఉత్పత్తి
- నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో వ్యవసాయశాఖ ఒప్పందం



చెరుకుపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ భూములు పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో విత్తనోత్పత్తి క్షేత్రాన్ని ప్రారంభించేందుకు వ్యవసాయశాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం జిల్లాలో కేవీకే కంపాసాగర్ విత్తనోత్పత్తి క్షేత్రంలో ఫౌండేషన్ సీడ్‌ను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. దీనికి తోడు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నందిపాడు కూడా కొంత వరి విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేస్తున్నప్పటికీ సరిపోని పరిస్థితి నెలకొంటుంది. జిల్లాలో వరిసాగు విస్తీర్ణం పెరగడంతో రైతులు నాణ్యమైన విత్తనాల కోసం ప్రైవేట్ సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలను విక్రయించాలని జిల్లా వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా డిండి మండలం చెరుకుపల్లి గ్రామంలోని వ్యవసాయ శాఖకు చెందిన 200 ఎకరాల్లో విత్తనోత్పత్తిని తిరిగి పునరుద్ధరించనున్నారు. దానికి అవసరమైన సాగునీరు, బోరు బావులు కూడా సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే విత్తనోత్పత్తి క్షేత్రానికి సంబంధించిన భూములను జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి దానికి అవసరమైన అన్ని వసతులు కల్పించే విదంగా అన్ని చర్యలను చేపట్టారు. ఈ క్షేత్రానికి పూర్తి స్థాయిలో ఏడీఏతో పాటు ఇద్దరు వ్యవసాయాధికారులను, ఇతర పరిపాలనా విభాగానికి చెందిన సిబ్బందిని కూడా నియమించారు.

నాణ్యమైన విత్తనాలు అందుతాయి

"విత్తనోత్పత్తి క్షేత్రంలో విత్తనాభివృద్ధి చేయడం వలన రైతులకు నాణ్యమైన విత్తనాలు తక్కువ ధరకు లభించే అవకాశం ఉంటుంది. పూర్తిగా వ్యవసాయ శాస్త్ర వేత్తలు, వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో విత్తనోత్పత్తి జరుగుతుంది.


- పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో ఒప్పందం

ఈ యాసంగి సీజన్ నుంచి తొలుత వరి, వేరుశనగ విత్తనాలను ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. దీనికి అవసరమైన ఒప్పందాన్ని నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో వ్యవసాయశాఖ ఒప్పందం చేసుకుంది. డిండి విత్తనోత్పత్తి కేత్రంలో ఉత్పత్తి చేసిన వరి, వేరుశనగ విత్తనాలను నేషనల్ సీడ్ కార్పొరేషన్‌ను అందజేసి అక్కడి నుంచి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించే విదంగా వ్యవసాయశాఖ ఒప్పందం చేసుకుంది.

విద్యుత్ శాఖలో గందరగోళం

- రెండు నెలల్లోనే ముగ్గురు ఎస్ఈల మార్పు
- ఆరోపణలు ఉన్న వ్యక్తికే మళ్లీ కీలక పోస్టు



నల్లగొండ: నల్లగొండ విద్యుత్ శాఖలో గందరగోళం నెలకొంది. జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్లు రెండు మాసాల్లోనే ముగ్గురు మారారు. గత రెండు నెలల క్రితం నల్లగొండ విద్యుత్ శాఖ ఎస్ఈగా పని చేస్తున్న చంద్రమోహన్ సిద్దిపేట జిల్లాకు, సూర్యాపేటలో పని చేస్తున్న పాల్‌రాజ్‌ను నల్లగొండ జిల్లా ఎస్ఈగా బదిలీ చేశారు. నెల రోజుల క్రితం మంత్రులు ఎస్ఎల్‌బీసీ సందర్శనలో ప్రొటోకాల్‌ను సక్రమంగా అనుసరించలేదన్న కారణంతో ఎస్ఈని సస్పెండ్ చేశారు. దీంతో భువనగిరిలో డీఈ ఎంఆర్‌టీగా పని చేస్తున్న రవిప్రసాద్‌ను నల్లగొండ ఇన్‌చార్జి ఎస్ఈగా నియమించారు. గత అయిదు రోజుల క్రితం జరిగిన విద్యుత్ అధికారుల బదిలీల సందర్భంలో భువనగిరి నుంచి ఆయనను నల్లగొండ ఎంఆర్‌టీ డీఈగా బదిలీ చేసి ఆయననే ఇన్‌చార్జిగా పూర్తి స్థాయిలో కొనసాగించాలని నిర్ణయించారు. తాజాగా నాగర్‌కర్నూలు ఎస్ఈగా పని చేస్తున్న వెంకటేశ్వర్లును నల్లగొండ ఎస్ఈగా బదిలీ చేస్తూ టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విధుల్లో చేరనున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

ప్రస్తుతం నల్లగొండ ఎస్ఈగా బదిలీపై వస్తున్న వెంకటేశ్వర్లు ఆరు నెలల క్రితం మిర్యాలగూడ డీఈగా పని చేసిన సమయంలో విద్యుత్ సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహించడం వల్ల త్రిపురారంలో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నా చేశారు. దీంతో ఆయన సరిగ్గా పని చేయడం లేదని సీఎండీ సమావేశంలోనే ఆయనను కార్పొరేట్ ఆఫీస్‌కు సరెండర్ చేశారు. ఆ తర్వాత మహబూబ్‌నగర్‌లో డీఈగా బదిలీ చేశారు. రెండు మాసాల క్రితం పదోన్నతిపై నాగర్‌కర్నూలు ఎస్ఈగా వెళ్లారు. ప్రస్తుతం నల్లగొండ ఎస్ఈగా మళ్లీ బదిలీ చేస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా బదిలీపై వస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు శుక్రవారం విధుల్లో చేరనున్నారు. రెండు మాసాల్లోనే ముగ్గురు అధికారులు మారడంతో అంతా అయోమయ పరిస్థితి నెలకొంది.

వాల్మీకి జయంతి

నల్లగొండ: నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్‌లు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయన్ అమిత్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ శ్రీదేవి, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతీలాల్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, పూర్ణచంద్ర

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు



కళా ఉత్సవ్‌లో విద్యార్థిని నృత్య ప్రదర్శన

నల్లగొండ: విద్యా శాఖ ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి డైట్‌లో నిర్వహిస్తున్న కళా ఉత్సవ్ పోటీలు గురువారం ముగిశాయి. ప్రధానంగా పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, మోడల్, కస్తూర్బాలకు చెందిన 156 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, సినీ కళలు, చిత్రలేఖనం, సంప్రదాయ కళలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. గాత్ర సంగీతంలో తిరుమలగిరిసాగర్ కేజీబీవీలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ కీర్తన ప్రథమ స్థానంలో నిలిచింది. వాయిద్య సంగీతంలో కట్టంగూర్ కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న అక్షయ, నృత్యంలో మిర్యాలగూడ ఎస్‌బీఆర్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సిరివెన్నెల, సినీ కళా విభాగంలో దేవరకొండ జెడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ హైస్కూల్‌లో 10 చదువుతున్న శరణ్య, చిత్రలేఖనంలో నాగార్జునసాగర్ హిల్‌కాలనీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న గ్రీష్మ, సంప్రదాయ కథలు చెప్పడం విభాగంలో వేములపల్లి కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న రేణుక ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరంతా నవంబర్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొననున్నారు. కళా ఉత్సవ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి అభినందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ రామచంద్రయ్య, జ్యూరీ సభ్యులు, గైడ్ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధగంట ముందే పాఠశాలకు తాళం

- చెన్నంనేనిపల్లి ప్రాథమిక పాఠశాలలో సాయంత్రం మూడు గంటలకే వెళ్లిపోయిన ఉపాధ్యాయుడు

కొండమల్లేపల్లి: మండలంలోని చెన్నంనేనిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గురువారం సాయంత్రం మూడు గంటలకే తాళం వేశారు. పాఠశాల సమయం అయిపోకముందే ఉపాధ్యాయుడు తాళం వేసి పిల్లల్ని ఇంటికి పంపించాడని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ఆరోపించారు. ఈ విషయమై ఎంఈఓ నాగేశ్వర్‌రావును వివరణ కోరగా.. గురువారం మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి మూడు గంటలకే రమ్మని ఉపాధ్యాయులకు చెప్పడంతో సదరు ఉపాధ్యాయుడు వచ్చినట్లు ఎంఈఓ తెలిపారు.

టీడీఎస్ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఉపేందర్



నాగారం: తెలంగాణ దళిత సంఘాల (టీడీఎస్) జేఏసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నాగారం మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి ఉపేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర చైర్మన్ ఈదుల పరశురాం చేతులమీదుగా గురువారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. దళితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహరించిన సంఘం రాష్ట్ర చైర్మన్, జేఏసీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

లతీఫ్ ఉల్లా షాఖాద్రి ఉర్సు ప్రారంభం

- గంధం ఊరేగింపును ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- గుట్టపైకి రూ.30 కోట్లతో ఘాట్ రోడ్డు పనులు చేపడతామని హామీ

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని లతీఫ్ ఉల్లా షాఖాద్రి ఉర్సు గురువారం ప్రారంభమైంది. పట్టణంలోని మదీనా మసీదు నుంచి గంధం ఊరేగింపును కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లతో కలిసి రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఉర్సును విజయవంతం చేయాలని కోరారు. లతీఫ్ ఉల్లా షాఖాద్రి గుట్ట, బ్రహ్మంగారి గుట్టను దర్శించుకునేందుకు సుమారు రూ.30 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు. గతంలోనే తాను దర్గా అభివృద్ధి పనులు చేశానని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దర్గా అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ రాములునాయక్, ఆర్డీఓ శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అహ్మద్ పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి సహకరిస్తా

క్రైస్తవుల అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో గురువారం రెవరెండ్ బిషప్ కరణం ధమన్ కుమార్ 35వ గురు పట్టాభిషేక వార్షికోత్సవానికి మంత్రి హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మాతంగి సత్యనారాయణ, బాబా, క్రైస్తవ నాయకులు పసల శౌరయ్య, కొంక సామ్‌సన్, రెవరెండ్ ఫాదర్‌లు అర్లారెడ్డి, తుమ్మ జోసెఫ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గంధం తీసుకెళ్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్



గంధం తీసుకెళ్తున్న పోలీసులు



నృత్యం చేస్తున్న ముస్లింలు

బొట్టుగూడ స్కూల్‌ను ఆదర్శంగా నిర్మిస్తాం



నల్లగొండ: బొట్టుగూడ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణం చేపడతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో చేపట్టిన బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.3కోట్లతో రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల లేని విధంగా బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు, పాఠశాల హెడ్మాస్టర్‌కు మంత్రి పలు సూచనలు చేశారు. 9, 10 తరగతులకు ప్రత్యేక డిజిటల్ తరగతులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేలా పాఠశాల నిర్మాణం చేపట్టాలన్నారు. పాఠశాలలోని అన్ని గదుల్లో ఏసీ, లిఫ్ట్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని, పనుల్లో ఎలాంటి నాణ్యత లోపించకుండా నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్తులో అవసరమైతే మరో అంతస్తు నిర్మించేందుకు అవకాశం ఉండేలా భవన నిర్మాణం ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్, సీఐకి చార్జి మెమో

గుర్రంపోడు: మండలంలోని ముల్కలపల్లికి చెందిన జాల రజిత హత్య కేసుకు సంబంధించి గుర్రంపోడు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సత్యనారాయణను సస్పెండ్‌చేస్తూ గురువారం నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా కొండమల్లేపల్లి సీఐ ధనుంజయకు ఎస్పీ నివేదిక ప్రకారం ఐజీపీ సత్యనారాయణ చార్జ్ మెమో జారీ చేశారు. హత్యను ఆత్మహత్యగా మార్చే ప్రయత్నం చేయడం, నిందితులను కేసు నుంచి తప్పించారని గుర్రంపోడు ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని ఈ నెల 14న సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. నిందితులతో కుమ్మక్కై, ఎఫ్ఐఆర్‌లో వారి పేర్లు పేర్కొనకుండా కానిస్టేబుల్ సత్యనారాయణ ద్వారా ఎస్ఐ రూ.లక్ష లంచం తీసుకున్నారని విచారణలో తేలింది.

ముగిసిన తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్ కస్టడీ

హుజూర్‌నగర్: ప్రభుత్వ భూములను అక్రమంగా బదిలీ చేసి రైతుబంధు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలతో గతంలో హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేసిన జయశ్రీ, కంప్యూటర్ ఆపరేటర్ జగదీష్‌ల పోలీస్ కస్టడీ గురువారం ముగిసింది. మూడో రోజు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు దాదాపు ఐదు గంటల పాటు తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్‌ను విచారించారు. విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఎవరి ప్రోద్బలంతో ఇతరుల పేరుపై పట్టా చేశారని పోలీసులు వారిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎవరైనా అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందా అనే కోణంలో మరిత సమాచారం రాబట్టినట్లు తెలిసింది. అంతేకాకుండా జర్నలిస్టుల ఇళ్ల పట్టాలకు సంబంధించిన వివరాలపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది. తహసీల్దార్‌కు సంబంధించిన ఆస్తుల వివరాలను పరిశీలించినట్లు సమాచారం. మూడు రోజుల పోలీస్ కస్టడీ ముగియడంతో ఇద్దరినీ హుజూర్‌నగర్ కోర్టులో ప్రవేశపెట్టి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం అల్వాల పాడు గ్రామానికి చెందిన చిర్ర మల్లయ్య రెండో కుమారుడు చిర్ర శ్రవణ్‌కుమార్(18) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా పండుగకు ఇంటికి వచ్చిన అతడు గురువారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద దొరికిన ఆధారాల ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతోనే శ్రవణ్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. రైలు కింద పడటానికి ముందు పురుగుల మందు తాగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ముఠా అరెస్ట్

- రూ.18 లక్షల విలువైన బియ్యం, 2 లారీలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ముఠాను వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం తన కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీవెంకటేశ్వర అయ్యప్ప ట్రేడర్స్ యజమాని చీమకుర్తి సుధాకర్ రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేయడంతో పాటు గుంటూరు, బాపట్ల, నరసరావుపేట ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తన మిల్లులో వాటిని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి గుంటూరుకు చెందిన ఏజెంట్ అశోక్ ద్వారా నెలకు 10 నుంచి 12 లారీలను తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్తాన్ రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం బసవకళ్యాణ్ జిల్లాకు చెందిన సయ్యద్ సలావుద్దీన్ లారీలో బియ్యం లోడ్ చేసి అశోక్, సుధాకర్ తెలంగాణ మీదుగా ముంబైకి రేషన్ బియ్యం తరలిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు రాష్ట్ర సరిహద్దు అయిన వాడపల్లి శివారులో పౌరసరఫరాల అధికారులతో కలిసి పోలీసులు లారీని పట్టుకున్నారు. అదేవిధంగా మరో లారీలో బాపట్ల నుంచి గుజరాత్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ భీమయ్యను అదుపులోకి తీసుకున్నారు. రూ.18లక్షల విలువైన 504 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు లారీలను సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. చీమకుర్తి సుధాకర్, సయ్యద్ సలావుద్దీన్‌ను అరెస్ట్ చేశామని, అశోక్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్ఐ, డిప్యూటీ తహసీల్దార్ జావిద్‌ను ఎస్పీ అభినందించారు.

హైదరాబాద్ ఎగ్జిబిషన్‌లో మర్రిచెట్టుతండా మహిళల స్టాల్



ఎగ్జిబిషన్‌లో మర్రిచెట్టుతండా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్

దేవరకొండ: హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో గ్రామీణ్ సెలబ్రేటింగ్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాకు చెందిన మహిళలు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌లో గిరిజన మహిళలు తయారుచేసిన హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులను ప్రదర్శించినట్లు తండా మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీనునాయక్ తెలిపారు. ఈ నెల 22 వరకు ఎగ్జిబిషన్‌లో ఈ స్టాల్ కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్టాల్ ఏర్పాటుకు సహకరించిన నాబార్డ్, ఏఆర్‌డీఎస్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముదిమాణిక్యం కాలువలో మృతదేహం లభ్యం

త్రిపురారం: మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపు వద్ద ముదిమాణిక్యం కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురువారం త్రిపురారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని సాయిగణేష్ నగర్‌కు చెందిన కన్నెకంటి గోపికిషోర్ (57) మానసికస్థితి సరిగ్గా ఉండటం లేదు. కుటుంబ సభ్యులు అతడికి ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయినా ఆరోగ్య పరిస్థితి కుదురుకోకపోవడంతో కొద్ది రోజులు బయట తిరుగుతూ ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన గోపికిషోర్ తిరిగి రాలేదు. గురువారం ఉదయం 7గంటల సమయంలో త్రిపురారం మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపు వద్ద ముదిమాణిక్యం కాలువలో స్థానికులు గుర్తుతెలియని మృతదేహన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహం వద్ద దొరికిన ఆధారాల ప్రకారం మృతుడు గోపికిషోర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలువ నుంచి గోపికిషోర్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హరిదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

నిందితుడిని శిక్షించాలంటూ ఆందోళన



శ్రీను ఇంట్లో కొండయ్య మృతదేహాన్ని ఉంచిన కుటుంబ సభ్యులు

వేములపల్లి (మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కాకునూరి కొండయ్య(64) హత్య కారణమైన వారిని శిక్షించాలంటూ గురువారం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. కొండయ్య బుధవారం ఇంట్లో ఇంటరిగా ఉన్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కొండయ్యను గ్రామానికే చెందిన కాకునూరి శ్రీను హత్య చేయించాడని కొండయ్య కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం శ్రీను ఇంట్లో కొండయ్య మృతదేహాన్ని సుమారు 3 గంటల పాటు ఉంచి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ వీరబాబు, ఎస్ఐ కృష్ణయ్య గ్రామానికి చేరుకుని నిందితులను పట్టుకుని శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో కొండయ్య కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన విరమించి మృతదేహాన్ని తమ ఇంటికి తీసుకెళ్లారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి



దత్తు (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతిచెందిన ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మునావత్ తండాలో బుధవారం సాయంత్రం జరిగింది. గురువారం గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మునావత్ తండాకు చెందిన మునావత్ మోహన్ కుమారుడు దత్తు(12) హైదరాబాద్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియడంతో బుధవారం దత్తు హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉండగా.. తన తండ్రికి వ్యవసాయ పనులు ఉండటంతో ఆగిపోయారు. బుధవారం రాత్రి సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దత్తు కిటికీకి ఉరేసుకున్నాడు. అయితే బుధవారం ఉదయం వ్యవసాయబావి వద్ద దత్తు తాతతో తమ పాలివారైన మునావత్ బిల్లు ఘర్షణ పడ్డాడు. దీంతో తమకు మునావత్ బిల్లు కుటుంబ సభ్యులపై అనుమానం ఉందని దత్తు తండ్రి మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య గౌడ్, ఎస్ఐ నర్సింహులుగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యుల కోరిక మేరకు నల్లగొండ మెడికల్ కళాశాలకు పోస్టుమార్టంకు పంపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రిలో శరత్ పౌర్ణమి వేడుకలు



శ్రీస్వామి అమ్మవార్ల సేవకు ముందు ప్రబంధ పారాయణం చేస్తున్న అర్చకులు



ఈఓ కు చెక్కు అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం శరత్ పౌర్ణమిని పురస్కరించుకొని ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక సేవను ఊరేగించారు. అనంతరం ఆలయ మండపంలో శ్రీస్వామి అమ్మవార్లను వేంచేపు చేయించి, వేద మంత్రాలతో పూజించి, ప్రబంధ పారాయణం చేశారు. విశేష ప్రసాదాన్ని ఆరగింపుగా చేసి పెట్టారు.

స్వర్ణ తాపడానికి రూ.10లక్షల విరాళం

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి స్వర్ణ తాపడం కోసం హైదరాబాద్‌లోని సైదాబాద్‌కు చెందిన కంకర్ సుధీర్‌రెడ్డి రూ.10లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం యాదాద్రీశుడిని దర్శించుకున్న ఆయన ఈఓ భాస్కర్‌రావును కలిసి రూ.10లక్షల చెక్కును అందజేశారు.

యాదాద్రిని అద్భుతంగా తీర్చిదిద్దారు

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మాజీ సీఎం కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారని సినీ నటుడు సుమన్ అన్నారు. యాదాద్రీశుడిని గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం చేశారు.

స్వర్ణగిరిని దర్శించుకున్న సుమన్

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూడా సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయన స్వాగతం పలికారు.